# 9

# సంతృప్తి గ్యారంటీ లేదు

## (ప్రసంగి 5; 6)

వస్తువుపై అతికించబడిన కాగితం మీద "సంతృప్తి గ్యారంటీ లేదు" అని రాసియుంటే, నీకు ముందుగా పరిచయంలేని ఆ వస్తువును కొనడానికి వెనుకాడవచ్చు - భక్తిహీనమైన జీవితానికి సంతృప్తి గ్యారంటీ లేదు, అయినా జనులు దానినే కావాలని కోరుకొంటున్నారు.

దేవుడు లేకుండ జీవించేవాని జీవితము వ్యర్థమైనది అనే భావనను ప్రసంగి 5, 6 అధ్యాయాలలో నొక్కి చెప్పుతున్నాడు. దేవుడు లేని సాధారణ వ్యక్తి చిక్కుపరచబడతాడు. చిట్టచివరకు ఆలోచిస్తే, భూమిమీద ఉన్నదేదీ అర్థమున్నట్టు గోచరించదు. భూసంబంధమైన జీవితపు అంతము మరణము. మరణమే మానవ అంతమైనప్పుడు, యికను జీవితానికున్న ఉద్దేశమేమి? దేవునినుండి కలిగే ప్రకాశం లేకుండ అటు జీవితానికి గాని, మరణానికి గాని ఏ అర్థము ఉండదు.

ఈ వాస్తవం దేవునితో మనకుండే సంబంధం మీద గొప్ప ప్రాముఖ్యతను కలిగిస్తుంది. దేవుని చిత్తాన్ని అక్రమంగా మార్చ ప్రయత్నించ కూడదు. దేవునికి సంపూర్ణంగా అప్పగించుకొనడంలో లోపించిన ఏ భక్తియైనా, జీవితపు వ్యర్థతకు తోడ్పడుతుంది. "మతస్థులనేకులు" అసంతృప్తులై ఉన్నారంటే ఆశ్చర్యపడనవసరం లేదు. కేవలం తమ్మును అసౌకర్యంగా చేసే మతం వారికుంది. వారు నిజంగా దేవుని సంతోషపరచలేదని తెలుపుటకు అది సరిపోతుంది - సంపూర్ణ సమర్పణతో వచ్చే భద్రతను యివ్వడానికి చాలనిది అని వారికి తెలుస్తుంది. ఈ భావనలే మనస్సులో ఉంచుకొని సొలొమోను ఈ భాగాన్ని రాశాడు.

### పూర్ణ హృదయంతో కాని దేవుని సేవ మనలను తృప్తిపరచదు (5:1-7)

దేవుని ఆరాధించుటకు సమీపించినప్పుడు మన అడుగులను జాగ్రత్తగా చూచుకోవాలి (5:1-3). మాట్లాడడం కంటె ఎక్కువగా వినడానికి మన మాయనను సమీపించాలి. బుద్ధిహీనంగా బలి అర్పించడం తప్పు అన్న సంగతి అనేకమంది గ్రహించరు. "బుద్ధిహీనులు అర్పించు బలులు" అని మొదటి వచనం సూచించింది, కేవలం బహిరంగ మైనదే కావాలి అనే భావన కలిగిన మనుష్యులు అర్పించేవి కావచ్చు. దేవుడు కోరేది కేవలం బలిని కాదు, ఆయనకు విధేయత కావాలి. దేవునికి విరిగి నలిగిన మనస్సు అంతరంగం కావాలి. బుద్ధిహీనుడు బలితో దేవుని సమీపించి, క్షమాపణ నిమిత్తము పూర్ణ హృదయంతోకాని వాని మనవిని ఆయన ఆలకించాలని ఎదురు చూస్తాడు; అయినా

దేవుని మాట ఆలకించకుండగనే అతడు ఆయన సముఖంనుండి వెళ్లిపోతాడు.

అసలు భక్తి (మతము) అనేది లేనివారికంటెను, ఆ విధంగా భక్తితో ఆటలాడేవారు కష్టకాలము ఎదురైనప్పుడు ఎక్కువగా కలతపరచబడి తల్లడిల్లతారు. దేవునియందు విశ్వాసం లేనివారు ఆయననుండి ఏమీ ఎదురుచూడరు, దేనికిని దేవుని నిందించరు. మరోవైపు నామకార్థపు మతస్థులైతే, తమ వాంఛలన్నిటిని దేవుడు తృప్తిపరచాలని తలంచుతూ ఉంటారు. అటు తమ్మును గాని యిటు తమ సమస్యలనుగాని దేవునికి సంపూర్ణంగా అప్పగించుకోలేని విశ్వాసం ఈ వ్యక్తులకు ఉంటుంది.

అనాలోచనగా గాని లేక యథార్థత లేకుండగాని దేవుని సమీపించడానికి విరోధంగా సొలొమోను హెచ్చరిక చేశాడు (5:2). "దేవునికి నీవు ఏమి చెప్తున్నావో జాగ్రత్త సుమీ. ఆయన పరమదేవుడు, నీవు కేవలం భూమిమీదనున్న ప్రాణివి అని గుర్తుంచుకో" అన్నట్టు అతడన్నాడు. దేవుని సముఖములో బహుగా మాట్లాడు నరుడు తన నోటితో పాపం చేసే అవకాశం ఉంది. దేవుని సమీపించినప్పుడు బుద్ధిహీనుడు అతిగా మాట్లాడుతాడు (5:3).

మనం దేవునికి మాట యిచ్చామంటే, మనం దాన్ని నిలబెట్టుకోవాలి (5:4-7). దేవునికి వాగ్దానం చేసి నిలబెట్టుకోలేకుండడం కంటె, ఆయనకు వాగ్దానం చేయకుండడమే మంచిది. మనం చేయలేని దానిని లేక చేయ ఉద్దేశింపని దానిని మనమెన్నడు వాగ్దానం చేయకూడదు. మన చేతులతో చేయనివాటిని మన నోళ్లతో వాగ్దానం చేస్తే, మనం పాపం చేసినవారమౌతాం. "నేను పొరపాటు చేశానంటూ" మనం చెప్పుకొనే సాకులవలన ఏ ప్రయోజనం ఉండదు. దేవుని యెదుటను ఆయన వర్తమానికుల ఎదుటను మాట్లాడడానికి మనం జాగ్రత్తగాను, యథార్థంగాను ఉండాలని సొలొమోను అంటున్నాడు. "దూత" అని 6వ వచనంలో ఉపయోగింపబడిన పదం బలిని జరిగించబోయే యాజకునిగాని, లేక నీవు పెట్టుకొనిన ఒట్టుకు సాక్షియైన దేవుని ప్రతినిధిని గాని సూచింపవచ్చు.

దేవునితో మనకుండే సంబంధం తీక్షణమైనది (సరదాపడేది కాదు). పెద్దపెద్ద కలలు కనడమో దేవునికి మనం చేసే పరిచర్య విషయంలో అతిశయపడడమో వ్యర్థం (5:7). జీవితమనేది అటు కాదు తీవ్రమైనది, దానిని ప్రసాదించిన ఆయనను సగౌరవంగాను భక్తితోను సమీపించవలసి ఉంటుంది.

ఈలాటి భావనలే 1 సమూయేలు 15:22లో వ్యక్తపరచబడ్డాయి. అమాలేకీయులను నాశనం చేయడంలో దేవుని ఆజ్ఞను నెరవేర్చుటయందు సౌలు తప్పిపోయాడు. సమస్తాన్ని నిర్మూలము చేయుమని పరమ దేవుడు ఆజ్ఞాపించాడు. అయితే బలికొరకు వాటిలో శ్రేష్ఠమైన కొన్ని పశువులను ఉంచడం మంచిదని సౌలు తలంచినట్టున్నాడు. అతడు రాజైన అగగును కూడ బ్రదుకనిచ్చాడు. ఆ సందర్భంలో తన ప్రవక్తయైన సమూయేలును పంపి సౌలు చేసినదానియందు ఆయన ఎంతగా దుఃఖపడ్డాడో అతనికి తెలిపాడు. దేవుడు ఏమి చేయనాజ్ఞాపించాడో దానిని తాను చేసినట్టు సౌలు తెలిపాడు. మనుష్యులలో అగగు ఒక్కడినే మిగిల్చినట్టును, ఎడ్లలోను గొర్రెమేకలలోను బలియర్పించడానికి గాను శ్రేష్ఠమైనవాటిని తాను మిగిల్చినట్టును అతడు తెలిపాడు. అది బాగానే ఉండియుండాలి కదా? దేవుడు బలులను కోరతాడు, కదా? సమూయేలు యిలా అన్నాడు "- తాను

సెలవిచ్చిన ఆజ్ఞను ఒకడు గైకొనుటవలన యెహోవా సంతోషించునట్లు, ఒకడు దహనబలులను బలులను అర్పించుటవలన ఆయన సంతోషించునా? ఆలోచించుము, బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ల క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్ఠము" విధేయత లేని బలులు దేవునికి అక్కరలేదు. ఉత్తదైన సేవ అటు దేవునికి గాని యిటు నరునికి గాని సంతృప్తి కలిగించదు.

## ధనము మనలను సంతృప్తిపరచ లేదు
## (5:8-6:6)

ధనము కూడ నరునికి సంతుష్టి కలిగించలేదని సొలొమోను కనుగొన్నాడు. ధనముకొరకైన ఆపేక్ష ధనవంతులు పేదలను అణచేలా చేయవచ్చు (5:8, 9). ఈ సందర్భంలో, అణచబడినవారు అధికారులయెదుట సరిగా విచారింపబడడం కష్టమనే సంగతిని సొలొమోను చర్చించాడు. దిద్దబడుకుండ న్యాయము తిప్పివేయబడడం కన్పించితే మనుష్యుడు ఆశ్చర్యపడనక్కర లేదు. "ఒక రాజ్యమందు బీదలను బాధించుటయు, ధర్మమును న్యాయమును బలాత్కారము చేత మీరుటయు నీకు కనబడినయెడల ఆశ్చర్యపడకుము; అధికారము నొందినవారిమీద మరి ఎక్కువ అధికారము నొందిన వారున్నారు; మరియు మరి ఎక్కువైన అధికారమునొందినవాడు వారికి పైగానున్నాడు" (5:8). ప్రతి ప్రభుత్వపు అధికారి మరియొకనికి లెక్క చెప్పవలసియుంటాడు. అందువలన, ప్రభుత్వానికి పెట్టుకున్న అర్జీలు ఈ మధ్య ఎక్కడైనా పోయే అవకాశముంది. అయినా ఎవడును దాని విషయంలో బాధ్యత నంగీకరింపడు.

ప్రభుత్వాధికారులు సామాన్య మానవుని పట్ల కనుపరచే నిర్లక్ష భావాన్ని చూచి సొలొమోను కలతచెందాడు. రాజునుండి క్రిందికి, సామాన్య జీవితాలనుండి భూఫల సాయకులవరకు ప్రతివారు ఎలా ఉన్నారో చూడవలసిన బాధ్యత ప్రభుత్వాధికారుల మీద ఉందని సొలొమోను తలంచుతాడు. భూమి సేద్యం చేస్తున్న సామాన్యుని, ప్రజలందరిలో అణచివేయకూడదు. జనులకొరకు జీవనాన్ని సంపాదించేది అతడు. అరుదైన రాజు ఈ విషయాన్ని గమనించి, అలా బాధింపబడినవాని విన్నపాలను వింటాడు. సామాన్య మానవుని న్యాయాన్ని అలక్ష్యం చేసే ప్రభుత్వం తన్నుతాను నాశనం చేసికొంటుంది. ఇదియు జీవితంలో వ్యర్థమే. వ్యక్తిగత సంపాదనా వాంఛను బట్టి యిది జరిగినా, కడకు అది తన్ను తాను నాశనం చేసికొనే స్థితిలోనికి వెళ్లుతుంది.

ధనాపేక్ష ఎన్నడూ సంతుష్టి చెందదు (5:10-12). ధనం వృద్ధిచెందే కొలది, దాన్ని ఖర్చుపెట్టే మార్గాలు ఎక్కువౌతాయి. తమ చేతులలో అది ఆడడం చూచే దానికంటె, కలిగినవారికి ధనం చేసే మేలేముంది? కడపటి పరిశీలనలో ధన సమృద్ధికి అర్థమేమీ ఉండదు. రాత్రులందు సుఖ నిద్ర చెందేవారెవరు – ఒక సామాన్యుడే, కష్టజీవియా, ధనవంతుడా? తాను కొంచెముగా తినినను ఎక్కువగా తినినను కష్టజీవి తన నిద్రను అనుభవిస్తాడు. తన ధనము మీద అక్కరగల ధనవంతునికి నిద్ర పట్టదు.

ఆస్తిగలవాడు తన ఆస్తిని దాచిపెట్టుకొని తనకు నాశనము తెప్పించుకొంటాడు.

అయితే ఆ ఆస్తి వక్రంగా తిరిగిన పరిస్థితులవలన వానియొద్దనుండి కోల్పోవును (5:13-17). తప్పుడు పెట్టుబడులవలనను, దొంగిలింపబడుటవలనను, అనారోగ్య పరిస్థితుల వలనను పోగొట్టబడుతుంది. పుత్రులుగలవాడైనను అతని చేతిలో ఏమియు లేక పోవును. అంత మాత్రానే అది అంత చెడ్డది కానేరదు. ఎందుకంటె, పెద్ద ఎస్టేటు కలిగి యితరులు అనుభవించడంలోని వ్యర్థతను గూర్చి ముందుగానే చూచాం. ఐశ్వర్యాన్ని కూడబెట్టి, అవివేకంగా పోగొట్టుకొనడంలోగల వ్యర్థతను సొలొమోను ఉదహరించాడు. కడకు వాడు తల్లి గర్భములోనుండి ఎలా వచ్చెనో అలాగే ఏమి తీసికొనకుండ పోతాడు.

తాను పరిశీలించిన ఈ సంగతులు సొలొమోను తన గత తీర్మానాల యొద్దకు అతని కొనిపోయాయి. దేవుడు తనకు దయచేసిన కష్టార్జితాన్ని సుఖంగా అనుభవించడమే వానికి శ్రేష్ఠమైనది (5:18-20). ఆస్తి అనుగ్రహింపబడినవారు, అది దేవునినుండి తమకు కలిగిన బహుమానంగా అంగీకరించాలి. తమకు కలిగిన ఆస్తిని అనుభవించడానికి సామర్థ్యం కొరకు వేడుకొంటూ వారు దానిని సద్వినియోగం చేసికోవాలి. అది కూడ దేవునినుండి కలిగే బహుమానమే. అలా చేసే వ్యక్తి ఈ జీవితాన్ని వెనుకకు తిరిగి చూచేటప్పుడు దుఃఖపడడు. దేవుడు వానికి హృదయపూర్వకమైన సంతోషాన్ని జీవించడంలో ప్రసాదిస్తాడు.

ఐశ్వర్యంతో ఉండే మరో సమస్య ఏమంటే, దేవుడు ఒకనికి కోరినదంతా యిస్తాడు కాని, దాన్ని అనుభవించడానికి తగిన ఆరోగ్యాన్ని అనుగ్రహించడు (6:1-6). ఇదియు వ్యర్థమే, ఎందుకంటే, తాను సంపాదించినది యితరులకు విడిచివెళ్లవలసియుంటుంది. ఒకనికి నూరుమంది పిల్లలుండి, బహు వృద్ధుడయ్యేవరకు బ్రతికియుండియు తన చేతుల కష్టార్జితాన్ని అనుభవించలేకుంటే, పడిపోయిన పిండమే మేలని సొలొమోను అంటున్నాడు (6:3). పిండము లేమిడితో వచ్చి చీకటిలోనికి పోవును. దాని పేరు చీకటిచేత కప్పబడును. అది సూర్యుని చూచినది కాదు, ఏ సంగతియు దానికి తెలియదు. అందులో మేలేమియు లేదు, అయినా ముసలివాడగువరకు అనేకమంది పిల్లలు కలిగి సంతోషము లేక చచ్చినవాని కంటె, పడిపోయిన పిండమే మంచిదిగా ఉన్నట్టు సొలొమోనుకు కన్పించింది. ఒకడు రెండువేల సంవత్సరాలు బ్రతికియు సంతోషముగాని సంతృప్తిగాని ఎన్నడూ ఎరుగకుంటే జీవించడంలోగల ఉద్దేశమేమి?

## వాంఛలు తీర్చుకొన వెదకడం మనలను తృప్తిపరచలేదు (6:7-12)

వాంఛ అనేది తృప్తిపరచబడనిది (6:7-9). జ్ఞానులేమి బుద్ధిహీనులేమి అందరు ఆహారంకొరకు పని చేస్తూ తమ జీవిత దినాలు గడపుతారు. బుద్ధిహీనుడైన ధనవంతునికంటె అంతంలో పేదవాడే శ్రేష్ఠుడుగా కన్పిస్తాడు. అతడు తన వాంఛలను స్వాధీనపరచ నేర్చుకుంటాడు. అతడు తన ప్రతి వాంఛను పోషించుకొన చూడడు. అధికమైన దానికొరకు అపేక్షించుటకంటె కలిగియున్న దానిని అభినందించి ఉపయోగించుకొనుటయే శ్రేష్ఠము.

తప్పించుకోలేని తీర్మానమేమంటే – "ఏమి ఉండబోతుందో అది ఉండబోతుంది" (6:10–12). సమస్త సంఘటనలు దేవుని చేతిలో ఉన్నాయి. మనము కేవలం నరమాత్రులమని, దేవునితో వాదించడమో లేక సందేహించడమో చేయకూడదు. దేవుడు లేకుండ మన ప్రయాసలన్నియు వ్యర్థమే, వాటికి అర్థమే ఉండదు. అప్పుడు, దేవునితో వాదించి మనం సంపాదించుకునేది ఏముంది? గతించిపోయే నీడకంటె కొంచెం ఎక్కువైన మనం, మనకు ఏది శ్రేష్ఠమైనదో ఎలా తీర్మానించగలం?

## ముగింపు

భవిష్యత్తు ఏమైయుంటుందో నరునికి చెప్పగలవాడెవడు? మన జీవితాలను దేవునికి అప్పగించి మనకు మేలైనదేదో తెలిసికొనుటకు ఆయనను నమ్మకపోయినట్టయితే, జీవితము యొక్క పరమార్థమేమో కనుగొనడానికి నిరీక్షణయే లేదు.

దేవుని అలక్ష్యం చేయడం మన ఏకైక నిరీక్షణను విసర్జించడమే ఔతుంది. యిర్మీయా యిలా అన్నాడు: "యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" (యిర్మీయా 10:23). భూసంబంధమైన ఏ ప్రయాసలైనా గాఢమైన మన వాంఛలను సంతుష్టిపరచలేవు. మన శ్రేష్ఠమైన దానిని దేవునికి సమర్పించడమే మన సంతుష్టికి మూలమైయుంటుంది.